


# పిల్లనగ్రోవి

రంజాన్ నెల. పాలసముద్రమంతా చిమ్మనగోలలోంచి చిమ్మబడుతూన్నట్లు పండువెన్నెల. కన్నతల్లి మమతవంటి ఆ ప్రశాంత నిశ్శబ్దంలో ఏట్టిజోలపాట వినిపిస్తోందోగాని - ప్రపంచం ఆదమరచి హాయిగా నిదురిస్తోంది. వీధిలో— రెండో ఆటచూచి యిళ్ళకు తిరిగివస్తూన్న జనం రద్దీ తగ్గిపోయింది. ఫకీరు మేలుకొలుపు, దానికితోడుగా కనక తప్పెటమ్రోత—క్రమంగా దగ్గరౌతున్నాయి.

పాల లక్ష్మయ్య యింటి నడవలో కట్టివేయబడివున్న చియ్యబలిసిన కోడెదూడ బుసలుగొట్టుతోంది. నట్టింట— పాల లక్ష్మయ్య చాపమీద పడుకొని నిద్రపోతున్నాడు. ఇంటివెనుక దొడ్లో అతనికున్న కొద్దిపాటి పశువులు నేలపై మోకరిల్లి అరమోడ్పుకనులతో నెమరువేసుకుంటున్నాయి. డాబాపైన అతని పెళ్లాం జయమ్మ, యిద్దరు కూతుళ్లు వెన్నెల్లో పడుకున్నారు.

వీధితలుపు తాళం వేసివున్నా—నడవలోనికి గాలి, వెలుతురు ప్రవేశించడానికి ఏ అడ్డంకూ లేదు. వీధిలోంచి చూస్తే లక్ష్మయ్య యిల్లు ఇనుపవూచల జల్లెడలోంచి చూస్తున్నట్లుంటుంది. నడవలోనుంచి డాబాపైకి మెట్లు న్నాయి. తన జబ్బపుష్టికి, కండబలానికి నిదర్శనంగా కాబోలు—ఆ కోడెదూడ ఇనుపగొలుసుతో ఇనుపవూచకు కట్టివేయబడివుంది. నడవకూ, నట్టింటికీ నడుమనున్న తలుపు తెరచివుంది. బయట వెన్నెల, ఇంటిలోపల మసకచీకట్లు.

కోడె—ఇనుప కటకటాల్లోంచి వీధిలోకి చూస్తోంది. వీధిలో — లాంతరువెలుగు దగ్గరకువస్తోంది. ఫకీరు పాట పాడుతూ వస్తున్నాడు. లక్ష్మయ్య యింటి ఎదురింట్లో ఒక మహమ్మదీయ కుటుంబం కాపురముంది. ఫకీరు ఆ ఇంటి యెదుట నిలబడ్డాడు. ఇనప రేకులూ, ఇత్తడి గజ్జెలూ ఘల్లు ఘల్లు మనేటట్లు తప్పెటమీద దరువువేస్తూ, గట్టిగా పాట లంకించుకున్నాడు. ప్రక్కన వేపచెట్లో — బెదరిపోయిన పక్షులు గూట్లో సర్దుకుంటున్న చప్పుడు...ఇంటిముందు ఊరకుక్క మొరిగిన సవ్వడి...

...గుండెధైర్యం అనేది ఒక విలక్షణ గుణం. ప్రాణి కోటిలో అది కొన్నింటిలో వుండవచ్చు; కొన్నిటిలో లేక పోవచ్చు. ఈసురోమంటూ వూగిపోయే బక్కవాడు— బొబ్బరించి బరిలోకి దూకేయగలడు; సామూ, గరిడీలతో శరీరాన్ని పెంచుకొన్న పహిల్వాను వెన్నిచ్చి పారిపోనూ వచ్చు... నడవలోని కోడెదూడలోకూడ యిటువంటి వైప

రీత్యమే కనిపించింది. తప్పెట మ్రోతకు అది జడుసుకొన్నది కాబోలు—తన శక్తినంతా ప్రయోగించి గొలుసును గట్టిగా గుంజింది. గొలుసు తెగింది. కోడె వెనుదిరిగి, చిందులు ద్రొక్కుతూ నట్టింట్లోకి దూరింది.

...డాబామీద పడుకున్న జయమ్మ, యిద్దరు పిల్లలు అదిరిపడి లేచారు. గొడ్డు పెడబొబ్బ పెట్టినట్లు ఆ ఆక్రందనం మళ్ళీ వినిపించింది. అది—ప్రాణాతురుని ఆక్రందనంలాంటి అరపు; నిద్రకళ్ళతో భయంకరాకారాన్ని చూచి జడుసుకొన్నవాడి వులికిపాటులాంటి కేక!.. ముగ్గురూ స్థాణువులై పోయారు, "అంబా!" "అంబా!" అంటూ కోడె బిగ్గరగా అంకెలు వేస్తోంది. ఫకీరు పాట, తప్పెట సవ్వడి దూరదూరమైపోతూ వినిపిస్తున్నాయి.

పెళ్లాం, పిల్లలు తెలియరాని భయంతో, ఆతురతతో క్రిందికి పరుగుతీశారు. నడవలో గొడ్డు లేదు. నట్టింట్లో లక్ష్మయ్య మూలుగు వినబడుతోంది. "ఎవరూ? ఏమిటీ? ఏంజరిగింది?" అంది అతని భార్య ఆదుర్దాగా.

"ఏం లేదులే! ఆలైటు వెయ్యి!" అన్నాడు లక్ష్మయ్య వినబడీ వినబడనట్లు.

ఆమె లైటు వేసింది. లక్ష్మయ్య చాపమీద లేచి కూర్చుని, కోడెమెడ నిమురుతూ వున్నాడు. అది తన పొడుగాటి నాలుకతో—అతని ఒళ్ళంతా నాకుతోంది. ఈదృశ్యం చూచి జయమ్మ ఆదుర్దా మరింత ఎక్కువైంది...దూడ

కట్టు త్రెంచుకొన్నది; నట్టింట్లోకి దూరింది; చీకట్లో భర్తను త్రొక్కి వేసింది; హఠాత్తుగా జరిగిన ఈ సంఘటనతో— నిద్రపోతున్న లక్ష్మయ్య కాస్తా హడలిపోయి దిక్కులు తోచక వెర్రివాడిలా అరిచేశాడు...ఇదీ ఆమె గ్రహించిన విషయం.

"తొక్కేసిందా? దెబ్బలేమైనా తగిలాయా?" అంది జయమ్మ ప్రవాహవేగంతో.

నిమిషానికి కొన్నివందల లెక్కలో మ్రోగిపోతున్న గుండెను అదుపులో పెట్టుకుంటూ..."లేదులే—పాపం— ముందు—దీన్ని కట్టివేసి—రా" అన్నాడు లక్ష్మయ్య నింపాదిగా.

జయమ్మ దాన్ని యథాప్రకారం కట్టేసింది.

లక్ష్మయ్య వెన్ను రాచుకుపోయింది. ఎడమచేతి అరచేయి నుజ్జు నుజ్జుయిపోయింది. లక్ష్మయ్య దాన్నేమీ లెక్క చేయలేదు. నిర్లక్ష్యంగా గాయానికి తడిగుడ్డ చుట్టి—ఏమీ జరగనట్టే పడుకుని నిద్రపోయాడు.

పాల లక్ష్మయ్య పాలవంటి మనిషి. మార్దవమూ, నిష్కల్మషమూ—ఇవి పాలకంటే ఉత్కృష్టమైనవి. అతన్ని ఆ ఆదిలక్ష్మితో సరితూచితే—ఎక్కువ తూగగలిగిన వ్యక్తి లక్ష్మయ్యే! ఎందుకంటే—ఆమె పాలకడలిలోనుండి పుట్టింది. కాని, లక్ష్మయ్యలో చిలికినంతసేపూ—మార్దవమూ, నిష్కాలుష్యమూ పుట్టుకొస్తూనే వుంటాయి.

పశువులపాలన అంటే అతనికి అమితప్రీతి. అతని గొంతువింటే—పశువులు వేణుగానం విన్నంత తన్మయత్వంతో మోరలు పైకెత్తుతాయి. అతని స్పర్శతగిలితే—కన్నతల్లి ముద్దుపెట్టుకున్నంత పారవశ్యంతో పులకించిపోతాయి. నిండనిడొక్క, ఎండినకండ, పండినబల్లు—అతని గొడ్లు ఎరుగవు.

అతని జీవనం పాల అమ్మకంపైన్నే ఆధారపడివుంది. ఆ ఏడు—ఆ వూళ్లో మొట్టమొదటిసారిగా పశుప్రదర్శనం జరిగినప్పుడు అతను రెండు బహుమతులు గెలుచుకున్నాడు. ఒకటి—అతని ఆవు దండిగా పాలిస్తుంది. రెండు—అతని కోడెదూడ బాగా చియ్యబలిసి నీటిబొట్టుపడితే జారిపోయేట్లు నిగనిగలాడుతోంది. ఆరోజు సంతోషాతిశయంతో అతడు ఎంతో సంబరపడిపోయాడు.

—ఆరాత్రి అతన్ని త్రొక్కివేసిన కోడెదూడ 'అంబా అంబా' అంటూ తండ్రిని పోట్టనుబెట్టుకున్నట్లు తల్లడిల్లిపోయింది.

లక్ష్మయ్య చేతిగాయం మానలేదు. రోజురోజుకూ బాధ ఎక్కువైంది. అరచేయి కుళ్ళిపోయింది. టౌనుకువెళ్లి జనరల్ ఆసుపత్రిలో నెలనాళ్లున్నాడు...

జయమ్మకు ఆకోడెదూడపైన మమకారం మాయమైపోయి, చిరాకూ కోపమూ పుట్టుకొచ్చాయి. చీటికీ మాటికీ—పట్టరాని ద్వేషంతో దాన్ని తెగబాదుతూ వుండేది.

దానికి నాలుగే నాలుగు గడ్డిపరకలు విదల్చి, దాని కడుపు మాడ్చేది. కుడితితొట్లో నీళ్ళు త్రాగబోతే—అకారణంగా వీపుమీది తాటవాలిపించేది. ఇటువంటి నిరాదరణతో—ఆదూడ మొండిబారిపోయింది. అప్పుడప్పుడు తిరగబడి ఆమెను కుమ్మబోయేది.

లక్ష్మయ్య ఆస్పత్రినుంచి తిరిగి వచ్చాడు. అతని గాయం మానింది. కాని ఆగాయంస్థానే ఒక వైకల్యం ఏర్పడిపోయింది. అతని చేతి వ్రేళ్ళు వంగవు. నిటారుగానే వుండిపోతై.

ఇదిచూచి జయమ్మ కడుపు రగిలిపోయింది. వెర్రి కోపంతో శాపనార్థాలు పెడుతూ కోడెను చితకబాదింది. లక్ష్మయ్య వారించాడు. చీవాట్లుపెట్టాడు. ఆమె చేతిలోని బడితెనులాగి అవతల విసిరేశాడు.

మరునాటి ఉదయం—ఆదూడ కుడితినీరు త్రాగుతుండగా "నీ కడుపు బద్దలుగానూ—నీది కడుపా, లేకుంటే చెరువా? ఇక చాలు—పద!" అంటూ ముక్కుదాడు పట్టి గుంజింది జయమ్మ.

అది ఆమెను కొమ్ములతో బెదరగొట్టింది. జయమ్మ రెచ్చిపోయి, పాక చూరులోని జాటీకర్ర లాక్కుని దూడ ఒళ్ళంతా ఛెళ్ళుఛెళ్ళుమనిపించింది. లక్ష్మయ్య తనజీవితంలో మొట్టమొదటిసారిగా తన భార్యపట్ల కోపాన్ని వ్యక్తపరుస్తూ, ఆమెచేతిలోని జాటీకర్రను లాక్కుని, "చబితే నీకాడూ!

నోరులేని పశువు—అది నిన్నేం చేసిందని? రాక్షసిలా అస్త్రమానమూ దాన్ని అలా చిత్రహింస చేయందే క్షణం బతకలేవూ?'' అంటూ ఆ జాటీతోనే ఆమెకు రెండు తగిలించాడు.

...పెద్దమ్మాయి పాలుపిండుతోంది. ఆ ఆవు పొదుగులోంచి అతని మనస్సు పాలై ప్రవహిస్తోంది. కోడెదూడ అరమోడ్పు కన్నులతో అతని అరచేతిని నాకుతూ నిలుచుంది. ఆ స్పర్శలో—అతని హృదయం పిల్లనగ్రోవియై, ఏదో చల్లటిపాట పాడుతూ వుండడం—ఆ నోరులేని పశువు వినగలిగింది.

★★